క్లుప్తంగా

జనగణనలో కులగణన చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్ : బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 26 తేదీన ఉదయం 10 గంటలకు వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో చేపట్టబోయే 'జనగణనలో కులగణన' రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ విషయమై పలువురు నేతలకు, రాజకీయ పార్టీల నేతలకు, ప్రజా సంఘాలకు ఆహ్వానం అందచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ నాయకులు శ్రీనివాసులు, నవీన్, ఉదయ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో శాంతిభద్రతలను పరిరక్షించాలి

కడప కల్చరల్ : బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర భద్రతా దళాలను వినియోగించాలని, లేకుంటే అక్కడి పరిస్థితి దేశభద్రతకే ముప్పుగా పరిణమించే ప్రమాదం లేకపోలేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్ అన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా గో రక్షణ ప్రముఖ్ అమర్‌నారాయణశెట్టి తదితరులతో కలిసి డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు.

25న సమావేశం

కడప అర్బన్ : ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం ఈనెల 25న ఉదయం 11 గంటలకు విజయవాడలోని గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశంకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి హాజరు కావాలని రాష్ట్ర కార్యదర్శి కె.చిన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రోడ్డుపైనే ఇసుక, కంకర



ఆర్టీసీ బస్టాండు ఆర్ఎం కార్యాలయం సమీపంలో నిల్వ ఉన్న కంకర, ఇసుక

కడప కార్పొరేషన్ : కడప ఆర్టీసీ రీజనల్ కార్యాలయం వద్ద ఇటీవల వరదనీటి కాలువ నిర్మించారు. ఈ సందర్భంగా ఇసుక, కంకర తోలారు. ఇటీవల ఆ పనులు కూడా పూర్తయ్యాయి. అయితే రోడ్డుపై వేసిన ఇసుక, కంకరను మాత్రం తొలగించలేదు. ఫలితంగా బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఒకవైపునే వాహనాలు వెళ్లడం వల్ల ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొన్ని మాసాలుగా ఈ కంకర, ఇసుక రోడ్డుపైనే ఉన్నా అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ వద్ద ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మను) పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలీ బేగ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన అడ్మిషన్ పోస్టర్లను శనివారం సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మను పాలిటెక్నిక్ కళాశాలలో మే 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఉంటాయని, ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి ప్రవేశ పరీక్ష జూన్ 13వ తేదీ మధ్యాహ్నం కడపలోని మను కళాశాల క్యాంపస్‌లో ఉంటుందని తెలిపారు. ర్యాంకు ద్వారా సీట్లు భర్తీ చేస్తారని చెప్పారు. వివరాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్ 9398083058ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల కేటాయింపు అశాస్త్రీయం



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం విద్యారంగంలో పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు అశాస్త్రీయంగా ఉందని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు అన్నారు. శనివారం కడపలోని ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎనిమిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం విడనాడాలన్నారు. విద్యాశాఖ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు విద్యారంగానికి మేలు చేసే విధంగా ఉండాలే కానీ హాని చేసే విధంగా ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మురళి, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు జాన్, బాలకృష్ణ ఆలమూరు ప్రసాద్, ఎల్వి రవిశంకర్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, శ్రీరాములు, సలాం పుల్లన్న, సలపాది శీను, నాగేంద్ర ఉన్నారు.

ఉత్సాహభరితంగా రన్ ఫర్ జీసెస్



రన్ ఫర్ జీసెస్ ర్యాలీలో పాల్గొన్న గురువులు, విశ్వాసులు

కడప కల్చరల్ : పాపుల రక్షణ కోసం శిలువపై ప్రాణత్యాగం చేసి త్యాగానికి మారుపేరుగా నిలిచిన దైవ కుమారుడు క్రీస్తు మహిమను ఘనపరిచేందుకు అంతా కలిసికట్టుగా ఆయన చూపిన బాటలో పయనిద్దామని సీఎస్ఐ సెంట్రల్ చర్చి పాస్టర్ విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. గుడ్‌ఫ్రై డే కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు శనివారం ఉదయం కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ విచారణ గురువులు పాస్టర్ విక్టర్ బాబు విశ్వాసులతో కలిసి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఆకుపచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఆఖరుఏడు మాటలు గురించి వివరించారు. మనిషి త్యాగాల ద్వారా మానవ సమాజానికి సేవ చేయవచ్చని, సాటి మానవుల క్షేమం కోసం రక్తం చిందించవచ్చని క్రీస్తు తన ప్రాణ త్యాగం ద్వారా ఉద్బోధించారన్నారు. ప్రభువు త్యాగం లోక రక్షణకోసమేనని, అందుకే పాపులను తన రక్తంతో కడిగిన ప్రభువయ్యాడని వివరించారు. మానవాళి అంతా నేటి తరుణంలో శాంతి సమాధానాల కోసం జీవించాలని, అప్పుడే ప్రభువుపై భక్తి గౌరవాలు కలిగి ఉన్న వారమవుతామని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా ర్యాలీ : తెల్లని టీ షర్టులు, టోపీలతో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్న ఈ రన్‌లో అడుగడుగునా రన్ ఫర్ జీసెస్ అంటూ నినాదాలు చేస్తూ తమ పరుగుతో నగరమంతటా సందడి చేశారు. చర్చి వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్లు మీదుగా తిరిగి చర్చికి చేరుకుంది. రాత్రి దాదాపు అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారానికి 40 రోజుల లెంట్ డేస్ (శోక దినాలు) పూర్తి కావడంతో ఆదివారం ఈస్టర్ సండేని ఘనంగా నిర్వహించేందుకు చర్చి కమిటీ సభ్యులు, గురువులు సిద్ధమయ్యారు. ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల్లోగా ప్రార్థనలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి మనోహర్ బాబు, మాజీ కార్యదర్శి డేనియల్, స్త్రీల మైత్రి, యవ్వనస్తుల సంఘం, సండేస్కూలు బాలలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే విద్యాభివృద్ధి సాధ్యం



కడప వీసీకి పూలమొక్కతో స్వాగతం పలుకుతున్న కృష్ణా విశ్వ విద్యాలయ వీసీ రామ్‌జీ

కడప ఎడ్యుకేషన్ : విశ్వ విద్యాలయాల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు పరస్పర సహకారం ఎంతో అవసరం అని దాంతోనే విద్యాభివృద్ధిని సాధించవచ్చని కడప, కృష్ణా జిల్లాల ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వీసీలు విశ్వనాథకుమార్, రామ్‌జీలు పేర్కొన్నారు. కృష్ణా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. రామ్‌జీ ఆహ్వానం మేరకు శనివారం మచిలీపట్నంలోని కృష్ణ విశ్వ విద్యాలయాన్ని కడప వీసీ విశ్వనాథ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు వైస్ చాన్సులర్లు తమ తమ విశ్వ విద్యాలయాల అభివృద్ధితోపాటు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యా ప్రమాణాలు మెరుగుదల, పరిశోధన కార్యకలాపాలు, వసతి సదుపాయాలు, మౌలిక వనరుల అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. వివిధ సెల్‌ల పరితీరును మెరుగుపర్చడంపై ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు.

నేడు సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కడప డివిజన్ అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ద్వైవార్షిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ బాబు, మురళీ, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి భాను కృష్ణతో పాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎన్‌జీఓలు ముందుకు రావాలి

కడప కార్పొరేషన్ : కడప నగరం చిన్నచౌకు గ్రామ పొలంలోని సర్వే నంబర్ 998లో సెంట్రల్ జైలు వద్ద ఉన్న హిందూ, ముస్లిం, క్రిష్టియన్ శ్మశాన వాటికలను నిర్వహణ చేయుటకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూవుల కోసం 3.16 ఎకరాలలో, ముస్లింల కోసం 3.16 ఎకరాలలో, క్రిష్టియన్ల కోసం 3.16 ఎకరాలలో వేర్వేరుగా ప్రహరీలతో శ్మశాన వాటికలు నిర్మించి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పూర్తిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. శ్మశాన వాటికలలో దహన కార్యక్రమాల కోసం, ప్రజల సౌకర్యార్థం 3 వాహనాలను కూడా ఏర్పాటు చేశారన్నారు. సదరు శ్మశాన వాటికలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు, ఇతర కమిటీలు మే నెల 5వ తేదిలోపు నగరపాలక సంస్థ కార్యాలయంలో తెలపాలన్నారు. ఇందులో ఏవైనా సందేహాలుంటే టీపీబీఓ, పి.హరీష్, సెల్:91604 09521 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

సైన్స్‌టూర్ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపింది



చెన్నైలోని ఓ సైన్సు మ్యూజియం వద్ద విద్యార్థులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : సైన్స్‌టూర్ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపిందని జిల్లా సైన్సు అధికారి వేపరాల ఎబినేజర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతూ వివిధ సైన్సు ప్రదర్శనలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం కలిగించడానికి విద్యాశాఖ అవకాశం కల్పించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి ఈ నెల 16వ తేదీ రాత్రి 300 మంది ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థులు వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయులతో కలిసి 7 బస్సుల్లో చెన్నైకు వెళ్లామన్నారు. చెన్నైలోని సైన్సు ప్లానిటోరియం, సైన్సు పార్కు, సైన్సు మ్యూజియం, దక్షిణి చిత్ర, మహాబలిపురంలోని వీల్ సన్‌డైల్ వంటివి చూసి విద్యార్థులు ఆనందించారన్నారు. సంబంధిత టూర్‌కు వెళ్లిన వారు రెండు రోజులపాటు అక్కడ అన్ని ప్రాంతాలను వీక్షించి 17వ తేదీ కడపకు చేరుకున్నారని తెలిపారు. ఈ రెండు రోజులపాటు వారు అక్కడ సైన్సుకు సంబంధించిన అన్నింటిని వీక్షించారన్నారు. వాటి వల్ల భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయుక్తం ఉంటుందన్నారు. ముఖ్యంగా వారిలో కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు.

• వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో స్వామి, అమ్మవారు



ఏకాంత సేవలో శ్రీ ప్రసన్న విశ్వేశ్వరుడు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలమూర్తులకు విశేష అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు రవిశంకర్ బృందం పూజలు చేసి రథాన్ని స్థానిక మాడవీధుల్లో ఊరేగించారు. తమ ఇళ్ల ముందుకే వచ్చిన ఆది దంపతులను దర్శించుకున్న భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రథం ఆలయానికి చేరుకోగానే మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ఏకాంత సేవ నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఈఓ శ్రీధర్ ప్రకటించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా



ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులతో కళాశాల సిబ్బంది



ర్యాంకులు సాధించిన చైతన్య విద్యార్థులతో కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో కడప నారాయణ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి భళా అనిపించారు. ఇందులో అబ్దుల్ హసీమ్ 1417 ర్యాంకు, రామ్ శరణ 2082, జగత్స్మరణరెడ్డి 2336, ఆదిత్య వర్ధన్ రెడ్డి 2550, ధనుష్ 3523, సుధీర్ కుమార్ రెడ్డి 6095, ధీరజ్ కుమార్ రెడ్డి 8179, శ్రీలేఖ 11049, సుజన 14426, నితిన్‌రెడ్డి 17071, ఉమర్ 18435, మహ్మద్‌హసాన్ 20032, దీపక్ 24658, మహ్మద్ అజన్ 25763, ర్యాంకులు సాధించారు. అలాగే మరో 200 మందిపైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో అర్హత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీజీఎం రామమోహన్ రెడ్డి, కోర్‌డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ఏజీఎంలు చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవ రెడ్డి, సుమన్ అభినందించారు.

చైతన్య విద్యార్థుల ప్రభంజనం

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కడప శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరిల్లో గౌతమ్ 321వ ర్యాంకు, జస్వంతి 458వ ర్యాంకు, గురు సూర్య 818వ ర్యాంకు, అన్విత్ 1214వ ర్యాంకు, సతీస్ 1968వ ర్యాంకు, శివరాం నాయక్ 6094 ర్యాంకులతోపాటు 52 మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో అర్హత సాధించారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను డీజీఎం బివి ప్రసాద్, డీన్ కెఎల్‌జి ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, ఏవో మనోజ్ కుమార్‌రెడ్డి, మల్లికార్జునస్వామి, నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అభినందించారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : 2025 సంవత్సరపు ఎగ్జిబిషన్ టెండర్ అక్రమాలపై విచారణ జరపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి కోరారు. శనివారం కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.70 లక్షల నుంచి కోటి వరకు ఉండాల్సిన టెండర్ కేవలం రూ.28లక్షలతో మొదలై రూ.30.50లక్షలకు టెండర్ దక్కడం ఎక్కడో ఏదో అవినీతి జరిగిందని అర్థమవుతోందన్నారు. సదరు టెండర్‌పై విచారణ జరిపి అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తల పవన్‌కుమార్, బొమ్మన విజయ్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత జిల్లాగా కడప

- డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి
- స్వచ్ఛ దివస్ లో భాగంగా రిమ్స్ లో 'ఈ-చెక్' కార్యక్రమానికి శ్రీకారం



రిమ్స్‌లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వైద్య సిబ్బంది

కడప అర్బన్ : స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జీజీహెచ్(రిమ్స్)లో సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవితో కలిసి డిప్యూటి కలెక్టర్ రంగస్వామి 'ఈ-చెక్' (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓ లు డాక్టర్ సునీత, గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ రంగ స్వామి మాట్లాడుతూ.. స్వచ్ఛ దివస్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారాన్ని 'ఈ-చెక్' థీమ్ తో మనం వాడిన ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించే కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు వాడుతూనే ఉంటారని, వాటి వ్యర్థాలను మన నివాస ప్రదేశాల్లో ఉంచుకోవడం ఎంతో ప్రమాదకరం అన్నారు. మన పరిసరాలను కూడా అవి విషపూరితం చేస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ అంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. రిమ్స్ లోని ప్రతి డిపార్ట్‌మెంట్ పరిపాలన విభాగంలో ఈ ఎలక్ట్రానిక్ వ్యర్థం సేకరణ చేపడతామన్నారు.

■ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి.రమాదేవి మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రా దివస్‌గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అదికూడా మన జిల్లా నుండే మూడు నెలల క్రితం అమలు కావడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ రిమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం – స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం చేపట్టిన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం కడప నగరంలోని జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్. సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వయంగా డీఎస్పీ సుధాకర్ చీపురు పట్టి శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించడంతో పాటు దైనందిన విధులు మరింత చురుగ్గా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్. పురుషోత్తం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

■ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ' కార్యక్రమం నిర్వహించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య ఆధ్వర్యంలో ఏ.ఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐలు వీరేష్, శివరాముడు, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

■ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లు, పరిసరాలలో 'స్వర్ణాంధ్ర-- స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల ఆవరణ, పరిసరాలలో మొక్కలు నాటి నీరు పోశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కడప వైఎస్ఆర్ సర్కిల్ : పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏపీఎస్‌బీసీఎల్ గోడౌన్‌లో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం లో భాగంగా 50 కిలోల ఈ వేస్ట్ నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వేంకటపతి, అసిస్టెంట్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ఎస్‌హెచ్‌ఓ కృష్ణ కుమార్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై వైవీయూలో అవగాహన


కడప ఎడ్యుకేషన్ : దేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి సమస్యగా మారిపోవడమే కాకుండా ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని వైవీయూ ఎంసీఏ సహ ఆచార్యులు కె. శ్రీనివాస రావు అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం విభాగం-9 ఆధ్వర్యంలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఇంపాక్ట్ ఆన్ ఎన్విరాన్మెంట్ అండ్ హెల్త్ ' అనే అంశంపై శనివారం వైవీయూలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కె . శ్రీనివాస రావు మాట్లాడుతూ భారతదేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ఒక పెద్ద సవాలుగా మారిందన్నారు. దేశం ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ కావడంతో ఈ-వ్యర్థాలు కూడా పెరిగాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ-వ్యర్థాల నియంత్రణ సరిగ్గా లేక ప్రజారోగ్యం దెబ్బతింటోందన్నారు. అధ్యాపకులు సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యర్థాల నిర్వహణ సరిగ్గా చేయకపోవటం వలన కాన్సర్, కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. భూమిలో సారవంతం పోయి రైతులకు పంట నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూలో స్వచ్ఛ ఆంధ్ర


కడప ఎడ్యుకేషన్ : డా. వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్దఎత్తున పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను వాడటం వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి తెలియ చేశారు.




పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది



కడప ఎస్‌బి కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమంలో డీఎస్పీ సుధాకర్, పోలీసు అధికారులు



మొక్క నాటుతున్న ఎక్సైజ్ సిబ్బంది



వ్యర్థాలను ఏరివేస్తున్న వైవీయూ వాలంటీర్లు

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

కడప రూరల్ : అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పాత రిమ్స్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలను అరికట్టడంపై కడప సహాయక అగ్ని మాపక అధికారి బసిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతనే ప్రయోగ పూర్వకంగా అగ్నిమాపక నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బసిరెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలే గాక అనుకోని విధంగా విపత్తులు సంభవించినప్పుడు త్వరిత గతిన సహాయం కోసం ఫోన్ నెంబరు 08562 242299, సెల్ నంబరు 9963737191 కు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో హోమియోపతి కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సాంబమూర్తి, హోమియోపతి ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనందరావు, శిక్షణా వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



కడప నగరంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహనను పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థినీ, విద్యార్థులకు, యువతకు, ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. విద్యార్థులు రోడ్ క్రాస్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.మైనర్ లకు వాహనం ఇవ్వకూడదని తల్లి దండ్రులకు సూచించారు.